

# మూగ మనసు



జ్యేష్ఠ శుద్ధ చతుర్దశీ ఆదివారం సాయంత్రం అయిదన్నర అవుతూంది. సాయంసంధ్య ప్రకృతి శోభను తిలకిస్తూ డాబా మీద పచార్లు చేస్తున్నాడు మురళి.

ఎదురుగా కొండల చివర తెరచాపల్లా తెల్లని తెల్లని మబ్బులు ఆ మబ్బుల చాటున, తగ్గిన కిరణాలతో మబ్బుల రంగుల మారుస్తూ, తన సర్వీసులో లావాదేవీలు నెమరువేసుకుంటూ పశ్చిమాకాశానికి వింత రంగులు పులుముతూ, రిటైరవబోతున్న గెజిటెడ్ ఆఫీసరులా వాగింటున్నాడు రవి.

సగం దాగిన రవి కెదురుగా చాలని జీతాలతో సతమతమయ్యే ఉద్యోగిలా వెలవెలబోతూ, ఎంకా విశాలాకాశంలో విహరించబోతున్నాడు శశాంకుడు.

ఉదయించిన చంద్రుని చిరునవ్వుతో పలకరించి అదృశ్యమయ్యాడు, మరో చోట ఉదయించాలనే ఆత్రతతో సూర్యుడు.

కాంతిని పుంజుకుంటూ, తళతళ మెరుస్తూ ఇన్‌ఛార్జి ఆఫీసరులా విడిపి పడుతున్నాడు చంద్రుడు.

నీలాకాశంలో తారక లుదయించాయి ప్రకృతి సౌందర్యావలోకనలో పరవశమవుతూన్న మురళి, "ఉషాకిరణ్ వచ్చిందిట .. మాస్టారూ ..." అని పదేళ్ల అమ్మాయి పక్కింటి డాబా మీదనించి అన్న మాటకు ఉలిక్కిపడి గబగబా ఆ అమ్మాయి వైపు నడుస్తూ,

కె. విజయలక్ష్మి

"నిజం?" అన్నాడు ఆశ్చర్యంగా చూస్తూ.

"అవును, మాస్టారూ. మా అమ్మ డాక్టరు గారి ఇంటికి వెళ్లిందిగా! వాళ్ల బంధువేనట ఆమె. ఈ ఊరు చూడాలని వచ్చారట."

"ఏ ఉషాకిరణమ్మా!"

"ఆమె ... ఆమే, మాస్టారూ. కథలు వ్రాస్తారూ! మీ క్లాస్ మేట్ ఉషాకిరణ్!" అతని మాట కడ్డువస్తూ నవ్వుతూ చెప్పిం దా అమ్మాయి.

"ఉష వచ్చిందా! నిజం!" మెరిసే కళ్లతో ఆ అమ్మాయి వైపు చూస్తూ అన్నాడు మురళి.

"నమ్మలేకపోతే వెళ్లి చూడండి." గిరుక్కున వెనక్కి తిరిగి వెళ్లిపోయిం దా అమ్మాయి.

'ఎన్నాళ్లయింది ఉషను చూసి! ఎన్నేళ్లయింది ఉషతో మాట్లాడి! ఆమె గొంతుతో నా గొంతు కలిపి పాడిన పాట లెంత దూరం పోయాయో గాలిలో! ఉష! నా హృదయం ఆక్ర

"ప్రార్థన గీతాల్లో ఆవేదన అణిగిపోతూంది, ఉషా! ... నాకు ఈ ప్రపంచం, మనిషి, మనిషి మనిషికీ మధ్య ఉండే బంధాలు— ఇవన్నీ తెలియక పూర్వమే ఓ అమ్మాయి నా మనసు దోచుకుంది. హృదయంలో పీఠం వేసుకు కూర్చుంది. మరో అమ్మాయిని శరీరానికి కట్టుకునే సాహసం నాకు లేదు..."

మించుకున్న ఉష! నా మనస్సు వశం చేసుకున్న ఉష! ... మరెవరితోనో జీవితం ముడిపెట్టుకున్న ఉష! కథల్లో నా కనిపించే ఉష! వచ్చింది ... ఊరు చూడాలని వచ్చింది. ఆమె రూపాన్ని దర్శించే భాగ్యానికి నోచుకున్నాయి నా కళ్లు!' దీర్ఘంగా నిట్టూర్చి డాబా మెట్లు దిగాడు మురళి.

అతని చేతులు పెట్టెలో అతని డైరీని వెతికాయి.

డైరీ మధ్య పేజీలో ఉన్న శుభ లేఖ తీశాడు. "ఉషాకిరణ్ ఎమ్.ఎ.కి ఇచ్చి ..." అతని హృదయం గట్టిగా పిండినట్లయింది. కళ్లలో నీటి పొరలు కమ్మాయి.

ఆమె పెళ్లి శుభలేఖ అందుకున్న క్షణాల్లో అవ్యక్తమయిన బాధకు గురి అయింది అతని హృదయం.

ఆవేదనలో జారిపోయిన గతాన్ని పొందుపరుస్తూ వ్రాసుకున్న డైరీ ఉషతో కలిసి గడిచిన తన చదువు, సంగీతము, నాలు వదనము — గడిచిన పాతిక సంవత్సరాలకు పూర్వం మూడు పేయిని సంవత్సరాలు వ్రాసు కున్నాడు మురళి.

తన గుండెల్లో దాగిన ఉషని చూస్తూ చదువుకుంటున్నాడు డైరీ. ఆ డైరీ పుటల్లో ...

మగపిల్లల స్కూల్లో ఆడ పిల్లలు చదవడానికి జంకే రోజు లివి.

ఆ రోజు ... పెద్ద పెద్ద పూల ఖద్దరు పరికిణీ, కాలరు జాకెట్టు వేసు కుని మెరిసే కళ్లతో క్లాసంతా కలియ జూస్తూ, ఆరవ క్లాసు రూమ్‌లో అడుగు పెట్టింది ఉష.

మా క్లాసందరు పిల్లలూ ఏవో గుసగుసలాడుతూండడం గమనించి, ఆ అమ్మాయి వైపు చూశాను. అప్పుడే ఆ అమ్మాయి నా చూపులతో చూపులు కలిపింది.

మొదటిసారిగా నా హృదయంలో అర్థం తెలియని తియ్యని సంచలనం.

అప్పటి ఆ లేత వయస్సులో ఏదో ఆత్మీయత, ఆ అమ్మాయితో స్నేహం చెయ్యాలనే తపన, మరొక్క సారి చూడాలనే కోర్కె...అంతే నాకు తెలిసిన అనుబంధం.

"నీ నోట్సు పుస్తకం ఆ అమ్మాయి కియ్యి, మురళీ!" అని మాస్టారు అనగానే టేబిలుమీద నా నోట్సు పుస్తకం పెట్టాను.

"మళ్లీ రేపు ఇచ్చేస్తాను, మాస్టారూ!" అంది ఉష. వీణ మీటినట్లు ఎంత తియ్యగా వినిపించింది ఉష గొంతు!

'ఏమమ్మా! వ్రాసుకున్నావా! చాలా బాగుందే రైటింగు' ... అంటున్నారు మాస్టారు.

నా వైపు సవాల్ చేస్తున్నట్లు చూసి నా పుస్తకం టేబిలుమీద చప్పుడు చేస్తూ పెట్టింది ఉష.

ఆ చూపుల్లో ఎంత గర్వం! ఆమె నడకలో ఎంత దర్పం! డాక్టరు కూతు ర్నని కాబోలు! చిన్నగా నవ్వి పుస్తకం తీసుకున్నాను.

ప్రతిరోజూ క్లాసులో అడుగు పెడుతూంటే ఆ పిల్లని వెతికేవి నా కళ్లు.

స్లిప్ టెస్టు పరీక్షలో తెలుగులో ఫస్టు మార్కు ఉషది. లెక్కల క్లాసు ఫస్టు నేను.

"నీకు లెక్కలు బాగా వచ్చా!" స్కూలు విడిచిపెట్టాక నెమ్మదిగా అడిగింది ఉష. మొట్టమొదటిసారిగా నాతో ఉష మాట్లాడింది. ఏదో పార వశ్యంతో ఆ అమ్మాయి మొహంలోకి చూస్తూ ఉండిపోయాను.

నా జవాబు వినకముందే ఆమె వెళ్లి పోయింది.

మరునాడు వంట ఇంట్లో అమ్మ దగ్గర కూర్చొని కబుర్లు చెబుతూన్న ఉషని ఆశ్చర్యంగా చూశాను.

"నాన్నగారు నీ దగ్గర లెక్కలు నేర్చుకోమన్నారు, మురళీ."

ఎంత పొంగిపోయాను! ఎంత గర్వించాను! ఆ పిల్ల రూపం చూసి ఎంత ముగ్ధుణ్ణయ్యాను!

లెక్క ఆన్సరు తప్పుచేశా నోసారి. చప్పట్లు చరిచి కిలకిలా నవ్వింది ఉష! ఎంత బాగా నవ్వుతుంది ఉష!

ఆమె నవ్వు వినాలని, ఆమె నన్నలా కవ్వించి హాస్యం చెయ్యాలని తరుచుగా తప్పుగా లెక్కలు చేస్తూండేవాణ్ణి.

మరి రావడం మానేసింది ఉష.

"ఏం రావడం మానేశావు?" అడిగాను ఆత్రతగా.

"నీకు గర్వం. నువ్వు సరిగా చెప్పలేవు, నా వైపు వెర్రిచూపులు చూడ్డం తప్ప.

నన్నుండి కొంచెం దూరంలో కూర్చు న్నాను.

"ఏది, మురళీ? నువ్వూ ఆ అమ్మా యితో పాడు ... సా...రీ...గా...మా..." చెప్పారు మాస్టారు.

నా వైపు ఒక్కసారి చూసి నా గొంతుతో గొంతు కలిపింది ఉష.


"సెభాష్! చాలా బాగుంది. ఈ ప్రార్థనగీతం పాడండి" అన్నారు సంగీతం మాస్టారు.

మేం ఇద్దరం కలిసి పాడే పాట నా చెవుల కెంత ఇంపుగా ఉండేది!

రోజూ స్కూల్లో ప్రార్థన గీతాలు ఉషా, నేనూ పాడేవాళ్లం.

ఎప్పుడైనా ఉష స్కూలుకి హాజరు కాకపోతే ఏదో నా నుంచి దూరమై పోయినట్లు, నా మనస్సదోలా వెలితిగ అయిపోయేది.

మరునాడు ఉషతో ప్రార్థన గీతం




రామమూర్తి మాస్టారుగారి దగ్గర ప్రైవే యుకి వెళుతున్నాను." నిరసనగా నవ్వింది ఉష.

ఏమో అనబోయాను. క్షమాపణ కాబోలు.

"వాళ్లే, అట్టే మాట్లాడకు! మహా దగ్గర బంధువులా ... అందరి ముం పిల్లల్లా కాక ... ఉషా! ... ఉషా! ... అంటూ పెద్ద ..." చురుగ్గా చూసింది ఉష.

నాకు ఏడుపు వచ్చినంత పని అయింది. ఆమె కళ్లలో మెరుపు, ఆ మెరుపు చాటున అహం, గర్వం, తెలివి—ఎన్నో తొణికిసలాడే ఆ చూపులతో చూపులు కలపలేక తల వాల్చాను.

రామ కోవెల అరుగుమీద సంగీతం మాస్టారి కెదురుగా కూర్చుని సరిగమలు నేర్చుకుంటున్నా ఉషని చూసి ముగ్ధు ణ్ణయ్యాను. యాంత్రికంగా ఆమె

చెప్పేటప్పుడు 'మా గొంతు లెప్పుడూ ఇలా కలిసి నిన్ను ప్రార్థించాలి. ఉషకి నా మీద ఎప్పుడూ కోపం రాకూడదు. మరి ... మరి ... మేమిద్దరం భార్యా భర్తల మైపోవాలి.' లేత మనస్సులో ... ఆ తియ్యని ఆ ఆకాంక్ష ... అప్పటి ఆ కోరిక ఇప్పటికీ నవ్వు తెప్పిస్తూంది.

నన్ను పట్టి ఫూల్‌ని చేశాడు దేవుడు.

నాలు వడికే ముందు ఆమె ముందు రాట్నం ఉంచేవాణ్ణి. బెల్ అవగానే, ఆ రాట్నం అలాగే వదిలి హుందాగా వెళ్లిపోయేది ఉష. అవును. మురళి ఉన్నాడుగా, ఆ రాట్నం మళ్లీ టీచరుకి అప్పగించడానికి!

నా అంతట నేను "నా నోట్సిస్తాను, వ్రాసుకుంటావా, ఉషా" అంటే, "అఖ్ఖ ర్లేదు" అంటుంది. ఎంత తిరస్కారం!

ఏడవ తరగతి చదువుతున్నప్పుడు

నా ఫోలు తెలుసుకున్నాను. నేను తెలుసు కోవడ మేమిటి! ఉష సితారు మీటి నట్టు చిన్నగా నవ్వుతూ అడిగింది:

"నేను క్లాసుకి రాకపోతే నీకు మతి పోతుందిట! ప్రార్థన గీతం రోజూ పాడేదే అయినా తప్పులు పాడేస్తావట! పాఠ్యం జోలికి పోవట! నిజమేనా?"

"ఎవరన్నారు?" అడిగాను.

"క్లాసంతా ... వట్టి రోమియోవని అంటూంటే..." పెంకెగా నవ్వింది.

"పోనీ, నువ్వూ అలాగే అనుకుని, క్లాసు ఎగగొట్టకు!" సంతోషంగా నవ్వాను.

"నీకోసం నేను క్లాసుకి రావడంలా."

"పోనీ, నేను నీకోసమే వస్తున్నాను, సరా!" అన్నాను తెగింపుగా.

"మొండి ... నాన్నగారితో చెబుతా నుండు..." ఉష రోషంగా చూసింది.

"ఉషా! హాస్యాని కన్నాను ... చెప్పవు కదూ?" ఆ పిల్ల దగ్గరిగా వెళ్లాను.

"ఛ! దూరంగా పో ... చెప్పనులే..." నవ్వేసింది ఉష.

ఆటలపోటీలో మగపిల్లల్లో ఫస్టు ప్రైజ్ మురళిది! వ్యాసరచనలో ఫస్టు ప్రైజ్ ఉషది!

ఇద్దరం ఒకేసారి స్టేజిమీద ప్రైజులు పుచ్చుకున్నాం. నా వైపు చిరునవ్వుతో చూసింది ఉష. అవ్యక్తానందాన్ని పొందాను.

అలా నాలుగైదుసార్లు ఫస్టు, సెకండు ప్రైజు లందుకున్నాం.

క్లాసంతా ఈర్ష్యతో చూచేవారు. స్కూలు పిల్లలంతా ఇంచుమించు మా ఇద్దరిని గురించే గుసగుసలాడేవారు.

కాని మేము వికసించని మొగ్గలం. నా మనస్సెంత పరుగులుతీసినా, ఊహా పథంలోనే...

మూడు సంవత్సరాల సహవిద్యార్థిని ఉష. చదువులో, సంగీతంలో, నూలు వడకడంలో నాకు పోటీగా నిలిచిన ఉష! ఆమె ప్రతి కదలికలో అందాలు చిందించి నన్ను పరవశింపచేసే ఉష! ఒంటరిగా ఉన్నప్పు డెన్నో మధురమైన ఊహలు రేపే ఉష! నా హృదయంలో చెరిగిపోని ముద్రవేసిన ఉష!

వెళ్లిపోయింది ... నేను కట్టుకున్న పిచ్చిక గూళ్లు కాలితో తన్ని వెళ్లిపోయింది. హఠాత్తుగా వెళ్లిపోయింది.

సెలవులకు తాతగారింటినుంచి వచ్చిన నాకు, "డాక్టరు గారికి నెల్లూరు జిల్లా ట్రాన్స్ఫరయి వెళ్లిపోయారు" అనే వార్త భరించరానిదయింది.

కడుపు నొప్పిగా ఉందంటూ చాలా సేపు ఏడ్చాను. గుండె లవిసేలా ఏడ్చాను.




ఇంకా ఏడుపు వస్తూంటే అనుకున్నాను, 'ఉషని ప్రేమిస్తున్నాను కాబోలు ... ప్రేమిస్తేనే ఆ అమ్మాయిని చూడా లనిపిస్తుంది... ఆమె నాకు నిజంగా కావాలి ... ఎలా!' అని.

ఆమె డాక్టరు కూతురు! ధనవంతుల ఇంటి పిల్ల. నేను ... స్కూలుమాస్టారు కొడుకును... పేదవాణ్ణి... ఎందుకో అద్దంలో మొహం చూసుకున్నాను. నా మొహం నాకు అందంగా కనిపించింది.

చాలా మంది అనగా విన్నాను, మురళికి అందం, తెలివి ఉన్నాయి అని... గుర్తు వచ్చింది.

అప్పుడు...ఆ వయస్సులో...ఆ లేత మనస్సులో రేగే కోరికలు, ఊహలు ఆనాటి భాషలోకి అనువదించి వ్రాస్తే ఎలా ఉండునో! ఆ భావాలకు భాష ఏమిటో నాకు తెలియదు. ఆమెను ఈ గడిచిన కాలంలో అందాలసుందరిగా, నవయౌవనిగా రూపొందించు కుంటూ చేపట్టాలనే వాంఛతోనే ఎస్. ఎ. చదివాను. రిజల్ట్సు వచ్చాయి.

పాసయ్యాను ఫస్టుక్లాసులో.

విన్నవే అమ్మని బ్రతిమిలాడాను, డాక్టరుగారు నెల్లూరులోనే ఉన్నారు... అడ్రసు తెలుసుకున్నాను ... వెళ్లి అడుగమ్మా అని.

అమ్మ సమ్మతించింది.

విధి ఎదురు తిరిగింది.

ఈరోజు శుభలేఖ వచ్చింది... ఈ రోజు ఏడుపు రాలేదు. నా మీద నాకే అసహ్యం. ఇంత ఆలస్యం ఎందుకు చేశాను? ఈ ఎనిమిది సంవత్సరాల కాలంలో ... ఒక్క సారి ... ఒక్కసారి... డాక్టరుగారికి ఏదన్నా ఉత్తరం వ్రాసి ఉంటే! ... నా కింతే కావాలి. నన్ను నేనే శిక్షించుకోవాలి. నా గుండెలు మండి పోతున్నాయి. నేను భరించలేకపోతున్నాను. పిచ్చి లెత్తేస్తుందేమో ...

ఉష ఆక్రమించుకున్న హృదయంలో ఇంకో స్త్రీకి స్థానం లేదు... నేను బ్రహ్మచారిని...

చదువుకున్న మురళి దీర్ఘంగా నిట్టూర్చాడు.

* * *

సంధ్యారుణ కిరణాల' తాకిడికి ఏటి కాలవ అలలు జలతారు తాపి తాళ్లా మెరుస్తున్నాయి. అవతలి ఒడ్డున ఉన్న మామిడి తోటలో పక్షుల కిలకిలారావాలు వింతగా వినిపిస్తున్నాయి. మెత్తని ఇసకలో వేలితో గీస్తూ ఒత్తిగిలి పడుకున్నాడు మురళి అన్యమనస్కంగా.

"మురళీ!" ఎప్పుడో విన్న గొంతు! ఆ గొంతులో మార్దవం.

ప్రఫుల్లవదనంతో కన్నార్పకుండా ఆమెను చూస్తూ నిర్మలంగా నవ్వి లేచి కూర్చున్నాడు మురళి.

చిన్నగా నవ్వి ఎదురుగా కూర్చుంది ఉష.

"ఉషా! ..." అన్నాడు మురళి. ఆ గొంతులో ఏ నాటిదో తపన.

"నన్ను మరిచిపోలేదా, మురళీ!"

"కొత్త బట్ట కద్దిన రంగు వెలిగి పోతుందా, ఉషా!" నెమ్మదిగా అని తల వాల్చాడు మురళి.

కొన్ని క్షణాలిద్దరి మధ్యా నిశ్శబ్దం తాండవించింది. గతించిన కాలం పునరావృతం కాదు!

"నన్ను చూద్దామని వచ్చావని పాప చెప్పింది. నాకెందుకో నమ్మలేక పోయాను. 'ఈ ఎనిమిది సంవత్సరాల జీవితంలోను, ఈ ఊర్లో గడిపిన మూడేళ్ళ ఏం విలువ ఉన్నదని వస్తావు? ఇక్కడ ఏం చూడాలని వస్తావు?... ఎవరిని చూడాలని వస్తావు?' అని అనుకున్నాను. కాని నిజంగా వచ్చావు... వెంటనే అక్కడికి వచ్చి నిన్ను చూడాలనిపించింది ... కాని ... రాలేకపోయాను. నువ్వే వచ్చావు. ఆ అమ్మాయి..." అంటూ ఆగాడు మురళి.

"మావారి చెల్లెలు, నాకు ప్రియమైన నెచ్చెలి. నాతో కూడా ఈ ఊరు చూడాలని వచ్చింది. పేరు రమాప్రభ. బి. ఎ." పరిచయం చేసింది ఉష.

"నమస్తే." చేతులు జోడించాడు మురళి.

"నమస్తే" అని, "వదినా, మీరు మాట్లాడుతూ ఉండండి. అలా ఆ తోట చూసి వస్తాను" అంది రమాప్రభ.

"కృష్ణా, ఆ అమ్మాయికూడా వెళ్ళు." ఆజ్ఞాపించింది ఉష.

"మీ ప్యూనా!" అడిగాడు మురళి.

"ఆఁ. హోదాకేం తక్కువలేదు!" నిరసనగా నవ్వింది ఉష.

"ఎన్ని సంవత్సరాలతరవాత చూశాను! పోనీ, వచ్చావు..." ఆర్ద్రమైంది అతని గొంతు.

"అవును, వచ్చాను. నా బాల్యం పంచుకొని నిర్మలమైన స్మృతులు నెమరు వేసుకోవాలని వచ్చాను. మీ అందరితో కలిసి చదివిన స్కూలు చూడాలని వచ్చాను" అంటూ, "మనం ప్రార్థన గీతాలు పాడే మర్రిచెట్టు నీడ చూడాలని వచ్చాను, మురళీ!" అంది అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ. అతని కనురెప్పలు చెమ్మగిలి ఉన్నాయి.

తుళ్ళిపడి శూన్యంలోకి చూస్తూ, "మనం సంగీతం నేర్చుకున్న రామకోవెల అరుగు చూడాలని వచ్చాను. బుర్ర గిల్లి లెక్కలు చెప్పే రామ్మూర్తి మాస్టారు గారిని చూడాలని, లాగా, గానా వేసుకుని ఈతలు కొట్టే ఈ ఏటి ప్రవాహం చూడాలని వచ్చాను" అంది ఉష తర్జనితో ఏటి కాలవ చూపిస్తూ.

"నన్ను చూడకూడదనే అనుకున్నావా, ఉషా!" నిష్ఠురం ధ్వనించింది ఆ గొంతులో.

"చెట్టుకి ఓ పక్షిగా ఎగిరిపోయిన బాల్యస్నేహితుల్ని ఎలా చూస్తా ననుకుంటాను?" పేలవంగా నవ్వింది ఉష.

"ఉషాకిరణ్ అంటే నువ్వే కదూ! నువ్వు వ్రాసిన కథలు...నీ కథలు దాచుకుంటున్నాను, ఉషా!"

"ఓహో! నా కథలు నువ్వు దాచుకుని చదువుకుంటున్నావు. నా కవిత్వమంటే మా వారికి మంట!"

"మంటా?" ఆశ్చర్యంగా చూస్తూ అన్నాడు మురళి.

"అవును. ఆయన వాస్తవ జగత్తుతో కుస్తీలు పడుతూంటారు. నేను ఊహాపథంలో తేలిపోతూంటాను."

"బాగుంది... పిల్లలూ ...సంసారం... ఎలా వ్రాస్తావు, ఉషా, కథలూ!" చిన్నగ నవ్వి ఆమె మొహంలోకి సంతోషంగా చూస్తూ అన్నాడు మురళి.

"హుఁ! సంసారం! పిల్లలూ ... వాటి నుంచి దూరంగా పారిపోయి ప్రశాంత స్వర్గాన్ని చవిచూచేదే కవి జగత్తు... రచనా వ్యాసంగమే ఒక మానసికయాత్ర. మధుర భావాల సరళి ఊహాసౌధం. రోజుల్లో ఊహించే క్షణాలు...కలం నడిచే కొన్ని క్షణాలు ఏదో మధురమైన అనుభూతులతో అవ్యక్తానందాన్ని పొందుతాను, మురళీ!" అంది ఉష ఆవేశంగా.

"అదృష్టవంతురాలివి..." బరువుగా ఊపిరి పీల్చి అన్నాడు మురళి.

"అదృష్టవంతురాలిని" అని ఆ పైన చిన్నగా నవ్వి, "లోకం దృష్టిలో అంతేలే... జీవితమంటే ఎలా ఉండాలంటావు? అసలు మనిషి తృప్తిగా జీవించాలంటే ఏమిటి అవసరం, మురళీ" అంది ఉష.

పకపకా నవ్వి అన్నాడు మురళి: "ఏం కావాలి? తృప్తిగా జీవించాలంటే డబ్బూ, హోదా — ఇంకేం కావాలి మనిషికి?"

"నన్ను చెప్పుతున్నావా, మురళీ? అవి రెండూ ఉన్నంతమాత్రంలో మనిషి తృప్తిగా జీవించలేడు."

"తృప్తిపడే తత్త్వం కానప్పుడు ఏమున్నా తృప్తిగా జీవించలేడు!" టక్కున అన్నాడు మురళి.

"పొరబడుతున్నావు! డబ్బూ, హోదా—ఇవి రెండూ ఉండగానే అదృష్టం అంటుంది లోకం... కాని ఈ లోకం ఊహించనిదీ, దృక్పథానికి కనిపించనిదీ ఇంకోటి కావాలి... అదే తనని ప్రేమించే వ్యక్తి ... తన నారాధించే హృదయం... అవి దుర్లభమైనప్పుడు ఆ జీవితం నిస్సారమంటాను. ఏమంటావు?" అంది ఉష.

"నీతో చర్చించలేను, ఉషా! కాని తృప్తి అనేది అస లుందా అని?... పట్టి ప్రేమతోనే సంతోష పెట్టగలరా? ఒక్క హృదయమిస్తే సరా! తిండీ, బట్టా ఇవ్వక్కర్లా! అవి రెండూ ఇచ్చినంత మాత్రాన తృప్తిపడతారా! నగలంటారు స్త్రీలు..."

"ఓహో! ఎన్ని నగలు కొంటున్నావేమిటి భార్యకు!" హాస్యంగా నవ్వుతూ అంది ఉష.

ఉదాసీనంగా మారిపోయింది మురళి వదనం.


రెండు క్షణాల తరవాత పెదవుల మీదికి నవ్వు తెచ్చుకుంటూ, "అయితే అన్నీ చూశావా!" అని అడిగాడు మాట మారుస్తూ.


"ఆఁ. అప్పటికి, ఇప్పటికి ఎంత మారిపోయింది ఊరు! నా స్మృతులే మిగిలాయి. వివాహ బంధంలా మనం చదివే స్కూలు గదికి వెక్కిరిస్తూ పెద్ద కప్పతాళం కనిపించింది. మనం ప్రార్థన గీతాలు పాడే మర్రిచెట్టు నీడలో నిప్పులు చెరుగుతున్నాడు సూర్యుడు. ఆ చెట్టు మూలమే లేదు. నా సంగీత విద్యలానే రామాలయం శిథిలావశిష్టమైంది. ఎత్తు ప్రదేశాలు పల్లమయ్యాయి. కాలిబాటలపై రోడ్లు పరుచుకున్నాయి. మన ఆటల గ్రౌండ్‌లో కాఫీ హోటళ్ళు లేచాయి. సాయంకాలాలు షికారుకెళ్ళే మామిడితోట పంటభూమి అయింది. ఇంకా ఏ మూల దాగున్నాయి ఆ నాటి చిహ్నాలు? అదిగో, చూడు. ఎందరో చూస్తూ ఎప్పటిలా ప్రవహిస్తూంది ఏటి కాలవ. మామూలుగా సాయంత్రం లాంతర్లు వెలిగించుకుంటున్నాయి చుట్టూ ఉన్న కొండలు. ఎప్పటికీ నిలిచేవి, మార్పు లేనివి ఇవే కాబోలు" అంది ఉష.

నవ్వుతూ కొండవైపు చూశాడు మురళి.

"చూశావా? అందరూ బాగున్నారా! పిల్లలెంతమంది! అనే ప్రశ్నలే రాలేదు మన మధ్య. అమ్మగారు అంతా బాగున్నారా? నీకు పిల్లలు ..." అన్నాడు నవ్వుతూ మురళి.

జలవిహారం — ఫోటో—సి. ఎస్. రావు (భోపాల్)





ఆగ్రా కోట  ఫోటో—సి. ఎస్. రావు (భోపాల్)

"ఉభయకుశలోపరి. పిల్లలు నలుగురు. నీకు?" మెరిసే కళ్లతో అతని వైపు చూస్తూ నవ్వుతూన్న ఉష కళ్లలోకి లోతుగా చూశాడు మురళి.

నిశ్శబ్దంగా శూన్యంలోకి చూస్తున్న మురళిని, "ఏం మురళీ, పిల్లలు లేరా?" అంది ఉష.

"నీకు తెలియకనే అడుగుతున్నా వనుకుంటాను. నేను పెళ్లి చేసుకోలేదు, ఉషా! ఉద్యోగమూ చెయ్యడంలేదు."

"నిజంగా నాకు తెలియదు, మురళీ... అసలు నువ్వెక్కడ ఉన్నావో కూడా ఇప్పటివరకూ తెలియదు. నిన్న ఎవరో ఆమె మా వాళ్ల ఇంటికి వచ్చి, "ఉషాకిరణ్ అని కథలు వ్రాస్తారు, ఆమేనా మీరు?" అంది ఆశ్చర్యంగా నా వైపు చూస్తూ.

"ఉషాకిరణ్ మీకెలా తెలుసు? ఎప్పుడో ఓ కథ అచ్చయినంత మాత్రాన గుర్తుంటానా?" అని అడిగాను.

"మా పక్కింటాయన మీ కథలు చాలా దాచారు. మా పాప తెస్తే చదివాను అంది. నువ్వేనా ఆ పక్కింటాయనవి? అలా అని తెలిస్తే మీ ఇంటికి వచ్చేదానను సుమా!" అంది ఉష.

"అవును, ఆ పాపే చెప్పింది నువ్వు వచ్చావని. కాని డాక్టరుగారు మీ కెలాటి బంధువో, ఆయనతో నాకు పరిచయం లేదు. చిన్న వయస్సులో ఎంత సన్నిహిత స్నేహితులమైనా, నిన్ను చూడాలనే ఆత్రతను అణిచివేసింది. మన సంఘ సంస్కారం ... మీ ఊరు చాలాసార్లు వచ్చాను. మీ ఇంటికి వద్దామనుకున్నాను."

"ఏం? ఎందుకు రాలేదు?" ఆశ్చర్యంగా అతని మొహంలోకి చూసింది ఉష.

"మీవా రేమనుకుంటారో? ఒంటరి వాణ్ణి ఎలా రాగలను, ఉషా! నేను సంసారినా, పిల్లల తండ్రినా, చెప్పు? ధైర్యంగా ఎలా రాగలను?"

"ఉష్" అని జాలిగా నిట్టూర్చి, "ఎందుకు అలా ఉండిపోయావు, మురళీ? నీకు అందం లేదా? గుణం లేదా? ఏ లోపముందని పిల్ల నివ్వరు? నీ కసలు ఏ అమ్మాయీ నచ్చకనే అలా ఉండిపోయావా? తోడు లేకుండా ఒంటరిగా ఇన్నేళ్లు ఎలా ఉన్నావు? ఇటుపైని ఎలా బ్రతుకుతావు, మురళీ!" ఏదో సానుభూతి, జాలీ ఉట్టిపడే కంఠంతో అంది ఉష.

"ప్రార్థన గీతాల్లో ఆవేదన అణిగిపోతూంది, ఉషా! ... నాకు ఈ ప్రపంచం, మనిషీ, మనిషీ మధ్య ఉండే బంధాలూ— ఇవన్నీ తెలియకపూర్వమే ఓ అమ్మాయి నా మనస్సు దోచుకుంది. హృదయంలో పీఠంవేసుకు కూర్చుంది. మరో అమ్మాయిని శరీరానికి కట్టుకునే సాహసం నాకు లేదు..."

"అయితే ఆ అమ్మాయినే పెళ్లి చేసుకోవలిసింది. అడక్కపోయావా వాళ్ల వాళ్లని?" ఆర్ద్రమైన గొంతుతో అంది ఉష.

"ఏమిటో పిరికివాణ్ణి ... చాతగాని వాణ్ణి. అడిగించే వేళకి ఆ అమ్మాయి ... కాదు, పెళ్లయిపోయింది..." అన్నాడు తడబాటుగా మురళి.

"ఎవరు, మురళీ, ఆ అదృష్టవంతురాలు! నిన్ను పొందకపోయినా ఆమె అదృష్టవంతురాలే. ఎవరు, మురళీ?" ఆత్రతగా అడిగింది ఉష.

"ఎవరా! ... చెప్పలేను, ఉషా..." అతని కళ్లనిండా నీళ్లు తిరిగాయి. గొంతు గాద్గదికమైంది...

"ఛీ.ఛీ. నీ జీవితం కాలరాసిపోయింది రాక్షసి... ఆమెమాత్రం ..."

"వద్దు, ఉషా! ఆమెను శపించకు..." అరిచినట్టు అన్నాడు మురళి.

"రమా, చూడు. మురళి అని అప్పుడప్పుడు చెబుతూంటాను. అతను!" అంది ఉష. వచ్చి తన ప్రక్కనే కూర్చుంటూన్న రమాప్రభతో.

"ఓ!" అంది చిన్నగా నవ్వుతూ రమాప్రభ.

"రేపు ఉదయం వెళ్లిపోతున్నాం. ఆ ఊరు వస్తే ... అహఁ కాదు...మా ఇంటి కోసారి తప్పకుండా రావాలి, మురళీ! వారేమీ అనుకోరు. చాలా మంచివారు" అంటూ లేచింది ఉష.

"అల్లాగే. వెళిపోతావా!" తామూ లేచి నిల్చుంటూ అన్నాడు మురళి.

ఒకరి వెనక ఒకరు నడుస్తూ ఊరి చివర మ్యాలు కెదురుగా నిల్చుని తన పక్కనే నిల్చున్న ఉషవైపు చూశాడు మురళి.

ఆమె ముఖకవళిక అతనికి అర్థం కాలేదు. రామకోవెల దగ్గర ఇద్దరి తోవలూ వేరయ్యాయి. రెండు గజాల దూరం నడిచాక వెనక్కి తిరిగి ఒకరి మొహా లొకరు చూసుకున్నారు. నాలుగు కళ్లూ చెమ్మగిల్లాయి...

'మురళి నన్ను ప్రేమించలేదుకదా!' ఆమె హృదయం కలుక్కుమంది. మనస్సంతా చెదిరిపోయింది. కళ్లు నిర్విరామంగా వర్షించాయి.

"ఏం, వదినా?" రమాప్రభ ప్రశ్న.

"నలక పడిందమ్మా!" కంగారు పడిపోయింది ఉషాకిరణ్. ★